క్లుప్తంగా

గర్భిణులకు శాశ్వతంగా పౌష్టికాహారం



గర్భిణులకు సీమంతాల సామగ్రిని అందజేస్తున్న చైర్మన్

లేపాక్షి: లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆరోగ్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు శాశ్వతంగా పౌష్టికాహారం అందిస్తానని లేపాక్షి ఆలయ చైర్మన్, కరణం రమానందన్ ప్రకటించారు. శుక్రవారం స్థానిక ఆస్పత్రిలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ఆశీస్సులతో కరణం రమానందన్ ట్రస్టు తరఫున నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. అనంతరం గర్భిణులకు చీర, జాకెట్, పసుపు,కుంకుమ, పూలు, గాజులు, పండ్లు పంపిణీ చేశారు. డాక్టర్ వెంకటచిరంజీవి, ఎంపీటీసీ సభ్యురాలు లలితమ్మతో పాటు వైద్య సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

లేపాక్షి: కుర్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత భాస్కర్‌రెడ్డి తండ్రి ఆదినారాయణ రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్‌తో పాటు సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, కోఆప్షన్ సభ్యుడే బషీర్, నాయకులు నరసప్ప, అన్సార్, నంజిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని ఆదినారాయణరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

డెంగీ నివారణపై అవగాహన



హళ్లికెర గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

అగళి: హళ్లికెర గ్రామంలో శుక్రవారం డాక్టర్ శివానంద ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా విద్యార్థులు , వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శివానంద తెలియజేశారు. ముందుగా నివాస ప్రాంతాల్లో ఉన్న వర్షపు నీటిని తొలగించారు. హెచ్‌ఏ సుందరయ్య ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తి, డీఎస్పీ

పెనుకొండ: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పిలుపునిచ్చారు. పెనుకొండ నగర పంచాయతీలోని మంగాపురం గ్రామంలో శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలు, పిల్లల సంరక్షణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయన్నారు. వాటి ద్వారా మహిళలు తమను తాము రక్షించుకోవాలని సూచించారు. న్యాయవాది శ్రీరాములు, హైకోర్ట్ న్యాయవాది శివరామకృష్ణ, డీఎస్పీ నరసింగప్ప మహిళా చట్టాలను వివరించారు.

కేబుల్ చోరీ

అగళి: ఇనగలూరు పంచాయతీ తోణసనపల్లిలో తాగునీటి పథకానికి చెందిన దాదాపు 300 విద్యుత్ కేబుల్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి రంగనాథ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి సంబంధించిన తాగునీటి పథకం మోటర చెడిపోవడంతో గురువారం సర్పంచ్ మంజుమ్మ మెకానిక్‌తో మోటర్ లాగి కేబుల్‌ను అక్కడే పెట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు అదే రోజు రాత్రి కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్, కార్యదర్శి తెలిపారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం



అమరాపురంలో విద్యాగణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



పెనుకొండ కోర్టు రోడ్డులో వినాయక విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం



రొద్దం మండలం పెద్దగువ్వలపల్లిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలో శుక్రవారం వినాయక నిమజ్జనం కార్యక్రమం కోలాహలంగా సాగింది. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వినాయక విగ్రహాలను పెద్ద ఎత్తున ఊరేగించి అనంతరం భోగసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో యువకులు, చిన్నారులు, మహిళలు, యువతులు ఉత్సాహంగా డ్యాన్సులు చేశారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు, మోటువారిపల్లి, చిన్నపరెడ్డిపల్లి, గొల్లపల్లి, దుద్దేబండ, గుట్టూరు,గొల్లపల్లి గ్రామాలలో శుక్రవారం వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.



పెనుకొండలో నిమజ్జనానికి వెళుతున్న వినాయక విగ్రహం



గుట్టూరులో విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

రొద్దం: మండలవ్యాప్తంగా వినాయక నిమజ్జనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వినాయక ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరాపురం: అమరాపురం పాత ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యా గణపతి విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం నిమజ్జనం చేశారు. అంతకుముందు విద్యార్థులు డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మడకశిర రూరల్: మండలంలో ఖరీఫ్ సాగు చేసిన వేరుశనగలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన సీ రంగాపురం, మల్లినాయకనహళ్లి గ్రామాల్లో వేరుశనగ, కంది పంటలను పరిశీలించారు. వేరుశనగ పంటకు ఆకుమచ్చ, బూడిద తెగుళ్లు ఆశిస్తున్నాయని, వీటి నివారణకు ఏఏ మందులు వాడాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ తిమ్మప్ప, రైతు సేవా కేంద్ర సిబ్బంది స్రవంతి, శిల్పా, రైతులు పాల్గొన్నారు.

అగళి: పంటల్లో మోతాదుకు మించి రసాయన ఎరువులను వినియోగించవద్దని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత రామసుబ్బయ్య, ఏఓ నాగరాజు రైతులకు సూచించారు. శుక్రవారం తోణసనపల్లిలో వారు రైతులతో కలసి పంటలను పరిశీలించారు. నానో యూరియా, నానో డీఏపీ, జీవన ఎరువులు, పచ్చరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను వారు రైతులకు తెలియజేశారు. వేప కషాయం వంటివి వాడి పురుగుల ఉధృతిని కొంత మేరకు తగ్గించవచ్చని వివరించారు. పంట వేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.



సీ రంగాపురం వద్ద వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

గుడిబండ: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని శాస్త్రవేత్త రామసుబ్బయ్య రైతులకు సూచించారు. గురువారం శంకరగల్లు గ్రామంలో వేరుశనగ, కంది, మొక్కజొన్న, కూరగాయలు పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏఓ వీరనరేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై తనిఖీలు



దుకాణదారుడితో మాట్లాడుతున్న కమిషనర్ జగన్నాథ్

మడకశిర: పట్టణంలో శుక్రవారం ప్లాస్టిక్ వాడకంపై మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. హోటళ్లు, దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న హోటళ్ల నిర్వాహకులకు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. ఈనెల 15 నుంచి మడకశిర మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు. అయినా వ్యాపారులు ఈవిషయాన్ని గుర్తించకుండా ప్లాస్టిక్‌ను వినియోగించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు

రొళ్ల: గంతికల్లుగొల్లహట్టి గ్రామంలో యాదవ కులస్తులు శుక్రవారం శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. మహిళలు పిండితో చేసిన జ్యోతులను మోసుకుని మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు వచ్చి శ్రీకృష్ణుడికి సమర్పించారు.

శనీశ్వరుని సన్నిధిలో సినీ నటుడు



సినీ నటుడిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: కన్నడ చలన చిత్ర ప్రముఖ హాస్య నటుడు రంగ రాయణ రఘు స్థానిక శనీశ్వర స్వర్ణ ఆలయాన్ని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన బెంగుళూరు నుంచి వచ్చిన ఆయన శనీశ్వరుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయం స్వర్ణ దేవాలయంగా మారిన తీరు ను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆలయ సమితి కార్యదర్శి సుబ్బనరసింహ ఆయన్ను ఘనంగా సన్మానించారు.

రేపు రక్తదాన శిబిరం

అమరాపురం: స్థానిక ఈశ్వరీయ బ్రహ్మకుమారి విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కేంద్రం నిర్వాహకురాలు పుష్పక్క తెలిపారు. వివరాలకు కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

హిందూపురం టౌన్: మున్సిపల్ కౌన్సిల్ హాలులో శుక్రవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం వాడీవేడిగా సాగింది. ముందుగా కౌన్సిల్ హాలులో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొత్త కూరగాయల మార్కెట్, వాణిజ్య సముదాయ భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో పురపాలక సంఘానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. మార్కెట్‌లోని సెల్లార్ స్థలాన్ని ఎటువంటి అద్దెలు తీసుకోకుండా పూల వ్యాపారస్తులకు కేటాయించడం సరికాదన్నారు. స్పందించిన చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ మార్కెట్ అనుసంధానంగా కూరగాయల టోకు వ్యాపారస్తులకు బస్టాండ్ ఆవరణంలో గతంలో స్థలం కేటాయించడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని, దీంతో వారికి తాత్కాలికంగా రైతు బజార్‌లో స్థలాన్ని కేటాయించామన్నారు. గతంలో నిర్వహించిన బహిరంగ వేలాలను రద్దుచేసి మరోసారి నిర్వహించాలని కౌన్సిలర్లు ఆసిఫ్‌వుల్లా, శివ తదితరులు కోరారు. మార్కెట్ విషయంతో పాటు ట్రాఫిక్ సమస్యపైన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేద్దామని చైర్మన్ పేర్కొన్నారు. గతంలో వార్డుకు రూ.3 లక్షల చొప్పున నిధులు కేటాయించారని, ఇప్పటివరకు వార్డుల్లో కనీస పనులు చేపట్టలేదని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో వార్డుకు రూ.4 లక్షలు కేటాయించిన నిధులతో వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చైర్మన్ అన్నారు. 7వ వార్డు కౌన్సిలర్ నాసిర బాను మాట్లాడుతూ వార్డుల్లో కాలువలు తక్షణమే నిర్మించాలని కోరారు.



కౌన్సిల్ సమావేశంలో సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

అవినీతిపై విచారణ చేపట్టండి

మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలంటూ లోకాయుక్త జారీ చేసిన ఉత్తర్వులను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రదర్శించారు. దీంతో వారికి టీడీపీ కౌన్సిలర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు విచారణకు సిద్ధంగా ఉన్నామని చైర్మన్ ప్రకటించడంతో వివాదం సద్దుమణిగింది. రెవెన్యూ సెక్షన్‌లో ముడుపులు ఇవ్వనిదే ఏ పని జరగడం లేదని కౌన్సిలర్ ఆసిఫ్ ఉల్లా సభ దృష్టికి తీసుకొచ్చారు. చివరగా 16 అంశాల్లో 15వ అంశం మినహా అన్ని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిల్ సభ్యులతో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

హిందూపురం: పట్టణంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపిన వివరాలు.. కంసాలపేటకు పేట చెందిన రామమూర్తి (53) క్యాన్సర్‌తో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గురువారం యాసిడ్ తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స ఫలించకపోవడంతో శుక్రవారం మృతి చెందాడు. అలాగే విద్యానగర్‌కు చెందిన రామాంజనమ్మ (50) కడుపునొప్పిని తాళలేక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

హిందూపురం–పరిగి రోడ్డు వద్ద కలిపికి చెందిన బాలాజీ, అరవింద్, సోమశేఖర్ శుక్రవారం రాత్రి బైక్‌పై వస్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ఘటనలో ముగ్గురికీ తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన చిన్నారుల ప్రదర్శన

హిందూపురం: పట్టణంలోని గణేష్ మండపాల చిన్నారులు వివిధ రకాల ప్రదర్శనలతో అలరిస్తున్నారు. శుక్రవారం కంసాలపేట చత్రపతి శివాజీ గణేష్ మండపం వద్ద చిన్నారులు భరతనాట్యం ప్రదర్శించారు. చిన్నారి వైష్ణవి శివతాండవ నృత్యం ఆకట్టుకుంది.

ఇదిలా ఉండగా స్థానిక శ్రీనివాసనగర్ వద్ద ఉన్న గణపతి ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా క్రీడా, తెలుగు భాషా దినోత్సవం



లేపాక్షి మండలం కొండూరులో ధ్యాన్‌చంద్, గిడుగు జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిర వైఎస్సార్ సర్కిల్‌లో వివిధ వేషధారణలతో విద్యార్థులు



హిందూపురంలో మాట్లాడుతున్న కవి సడ్లపల్లె చిదంబరెడ్డి

లేపాక్షి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అగళి: విద్యార్థులు మాతృభాషను మరువకూడదని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

మడకశిరరూరల్: మండలంలోని బుళ్లసముద్రం సూర్యవిద్యానికేతన్, ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం తెలుగుభాష దినోత్సవాన్ని జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాతృభాషాభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

హిందూపురం టౌన్: వ్యవహార భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా పట్టణంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కల్లూరు సుబ్బారావు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు జరిపారు. ప్రముఖ మాండలిక కవి సడ్లపల్లి చిదంబరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత రాజశేఖర్‌రెడ్డి, తెలుగు భాషా అధ్యాపకులు అశ్వర్థనారాయణ తెలుగు గొప్పతనాన్ని తెలియజేశారు. క్రీడాదినోత్సవం సందర్భంగా హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్‌ను స్మరించుకున్నారు. ఉపాధ్యాయులు సిద్దగిరి శ్రీనివాసులు, రామాంజినేయులు, కిష్టప్ప, మంజుల, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని సత్యసాయి కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఏఓ కేశవయ్య మాట్లాడుతూ గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషాదినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేశారు.

పరిగి: శాసనకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉఎపాధ్యాయులు విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

న్యాయవాదిపై కౌంటర్ కేసు రద్దు చేయాలి



ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

పావగడ: స్థానిక న్యాయవాది సుధాకర్‌పై దాఖలైన కౌంటర్ కేసును రద్దు చేయాలని స్థానిక జేఎంఎఫ్‌సి బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట శుక్రవారం రెండవ రోజు వారు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అంతకుముందు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్ ఆధ్వర్యంలో కోర్టు నుంచి ర్యాలీగా తరలి వచ్చిన న్యాయవాదులు మూకుమ్మడిగా తాలూకా కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విజయకుమార్ మాట్లాడుతూ కౌంటర్ కేసు రద్దుపై పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

పింఛన్ల తొలగింపు ఆలోచన విరమించుకోవాలి

మడకశిరరూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నవారికి పింఛన్లు మంజూరు చేసి కొండంత భరోసా కల్పిస్తే కూటమి ప్రభుత్వం అర్హత ఉన్న పింఛన్ తొలగించే ఆలోచన మానుకోవాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలైనా కొత్త ఫించన్లు మంజూరు చేయలేదని గుర్తు చేశారు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్ అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీపై సీఎం చంద్రబాబు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కొత్త ఫించన్ మంజూరు చేయకనే వేరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్ తొలగించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. యథావిధిగా దివ్యాంగులకు పింఛన్ పంపిణీ చేయాలని లేకపోతే వారికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ప్రకటించారు.

ధర్మ స్థలాన్ని కించపరచడం తగదు



మాట్లాడుతున్న వెంకట్రామయ్య

పావగడ: దేశంలోనే పరమ పవిత్రమైన మంజునాథ స్వామి నెలకొన్న ధర్మస్థలను కించ పరచడం అమానవీయమని స్థానిక బీజేపీ నేత డా జీ వెంకట్రామయ్య స్పష్టం చేశారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో శుక్రవారం నిర్వహించిన ధర్మస్థల భక్తుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, బలరామరెడ్డి, ఎస్ఏ ఈరణ్ణ, బీజేపీ తాలూకా అధ్యక్షుడు అశోక్ తదితరులు ధర్మ స్థలం పవిత్రతపై మాట్లాడారు. ధర్మ స్థల గ్రామీణాభివృద్ధి యోజనాధికారి మహేశ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1న పట్టణంలో నిర్వహించే ధర్మ సంరక్షణ ర్యాలీలో ధర్మ స్థల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీ ని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలకు గ్రైండర్ అందజేత



గ్రైండర్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

హిందూపురం: మలుగూరు గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు గ్రైండర్‌ను వితరణ గావించారు. శుక్రవారం రూ.35 వేల విలువైన గ్రైండర్‌తోపాటు 60 బార్‌లైట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.వి.రమణబాబు, సూపరింటెండెంట్ ఆనంద్, పూర్వ విద్యార్థులు రమేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా శనివారం జరుగబోయే వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ రమేష్‌బాబు నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన నిర్వాహకులకు నిమజ్జనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

ఎన్‌ఎంయూఏ జిల్లా ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ

మడకశిర: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన రామకృష్ణ ఎన్ఎంయూఏ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈయన గతంలో మడకశిర డిపో ఎన్ఎంయూఏ అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రామక్రిష్ణను మడకశిర డిపో ఎన్ఎంయూఏ నాయకులు అభినందించారు.

వారపు సంత వాయిదా

పెనుకొండ: పట్టణంలో ఆదివారం జరిగే వారపు సంతను వాయిదా వేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం వినాయక నిమజ్జనం పెద్దయెత్తున జరుగుతుండడంతో వారపు సంత వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి వారపు సంత సెప్టెంబర్ 1న జరుగుతుందని, ప్రజలు గమనించాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ మీట్

మడకశిర: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు చైర్మన్ నరసింహరాజు అధ్యక్షతన కౌన్సిల్ మీట్ నిర్వహించనున్నట్లు కమిషనర్ జగన్నాథ్ తెలిపారు. సమావేశానికి వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్‌సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు

రొద్దం: మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం కొత్తపల్లి గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. వాల్మీకి బోయ కులస్తుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రామాంజనేయులు పేర్కొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

గుడిబండ: పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం జ్ఞానవృక్ష చారిటబుల్ ట్రస్ట్ వరప్రసాద్, మహదేవప్ప తదితరుల ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అలాగే క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.మంజుళ, ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.